



ఆ ఊరిలో..

మూడు బొడ్రాయిలు

7

ఎక్కడా లేని విధంగా ఆదిభట్లలో ఏర్పాటు

ఎప్పుడు ఎవరు ప్రతిష్ఠించారో తెలియదు

మూడు నాభి శిలలకు ప్రత్యేక పూజలు

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు

ఆదిభట్ల.. పరిచయం అక్కర్లేని ఊరు. ఇబ్రహీంపట్నం మండలంలోని ఈ గ్రామం పేరు నేడు ప్రపంచవ్యాప్తంగా వినిపిస్తోంది. పేరున్న పెద్ద పెద్ద సాఫ్ట్‌వేర్ కంపెనీలన్నీ ఇక్కడే వెలిశాయి. పెట్టుబడులకు గ్యారంటీలా అనేక ప్రత్యేకతలు ఉండడటంతో నేడు అభివృద్ధికి కేరాఫ్‌గా మారింది. వీటితో పాటు మరో ప్రత్యేకత ఉంది. ఎక్కడైనా గ్రామ నడిబొడ్డున నాభిశిల(బొడ్రాయి) ఏర్పాటు చేసి అక్కడి నుంచి గ్రామాన్ని నిర్మాణం చేస్తారు. కాగా, దేశంలోనే ఎక్కడ లేని విధంగా ఈ గ్రామంలో మూడు బొడ్రాయిలున్నాయి. ఎప్పుడు, ఎవరు, ఎందుకు ప్రతిష్ఠించారో తెలియదుగాని ఇప్పటికీ ఆ ఆచారం అలాగే కొనసాగుతోంది. బోనాల పండుగ సమయంలో మూడు చోట్ల ప్రత్యేక పూజలు జరుగుతుండటం విశేషం.



నరకప్రాయం..

ప్రయాణం

6

రోడ్లపై భారీ గుంతలు..

వాహనదారుల తిప్పలు

పెద్దేముల్ మండలంలో

అధ్వానంగా రోడ్లు



పడిపోతున్న

పత్తి ధర

7

దక్కని మద్దతు ధర

జాడ లేని సీసీఐ కొనుగోళ్లు

దూది రైతుకు దుఃఖమే



పాత భవనంపై

కన్ను!

8

తాండూరు మున్సిపల్

బిల్డింగ్‌కు రియల్టర్ల ఎసరు

యాసంగి సాగుపై రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. వానాకాలం కురిసిన భారీ వర్షాలకు జిల్లాలోని ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు జలకళను సంతరించుకున్నాయి. పెరిగిన భూగర్భ జలాలతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత పదేళ్లతో పోలిస్తే ఈ యాసంగిలో రెట్టింపు స్థాయిలో సాగు విస్తీర్ణం పెరగనుందని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే అధికారులు యాసంగి సాగు ప్రణాళికను ఖరారు చేశారు. వికారాబాద్ జిల్లాలో 1,42,159 ఎకరాలు, మేడ్చల్ జిల్లాలో 19,758 ఎకరాల్లో పంటలు సాగు కానున్నట్లు అంచనా వేశారు.



బంట్వారం మండలం లక్నాపూర్ ప్రాజెక్టు(ఫైల్)

యాసంగిపై గంపెడాశలు!

భారీ వర్షాలతో పెరిగిన భూగర్భజలాలు

కళకళలాడుతున్న చెరువులు, కుంటలు

ఈసారి రెట్టింపు సాగుకు అవకాశం

ప్రణాళిక సిద్ధం చేసిన అధికారులు

వికారాబాద్ జిల్లాలో 1,42,159, మేడ్చల్ జిల్లాలో 19,758 ఎకరాల్లో సాగు అంచనా

అవసరం మేరకు ఎరువులు, విత్తనాలు సిద్ధం

అతివృష్టితో కన్నీళ్లు మిగిల్చిన వానాకాలం!

బోర్లలో నీరు బాగా పెరిగింది



ఇప్పటికే శనగ విత్తనాలు విత్తేందుకు సిద్ధంగా ఉన్నాం. భారీ వర్షాల వల్ల బోరులో నీరు పెరిగింది. యాసంగి వరిసాగుకు నీరు పుష్కలంగా ఉంది. వానాకాలం చివరల్లో కురిసిన వర్షాలకు పత్తి, మొక్కజొన్న పంటలకు తీవ్ర నష్టం జరిగింది. యాసంగిపై ఎన్నో ఆశలు పెట్టుకున్నాం. నీళ్లు సరిపడా ఉన్నందున కరెంట్ కూడా సక్రమంగా ఉంటే యాసంగి పంట చేతికందినట్లే..

-ఎం.వెంకటయ్య, రైతు, జాఫర్‌పల్లి



నీటిని తోడిపోస్తున్న మోటారు

మేడ్చల్ ప్రతినిధి/పరిగి, అక్టోబరు27 (ఆంధ్రజ్యోతి): వానాకాలంలో కురిసిన భారీ వర్షాలకు జిల్లాలోని నీటి వనరులు కళకళలాడుతున్నాయి. భూగర్భజలు పెరగడంతో మోటార్లు నాన్‌స్టాప్‌గా నీటిని తోడిపోస్తున్నాయి. దీంతో యాసంగి సాగు భారీగా పెరగనుందని వ్యవసాయాధికారులు అంచనాలు సిద్ధం చేశారు. పరిగి, వికారాబాద్, కొడంగల్, తాండూరు ప్రాంతాల్లో అత్యధిక వర్షపాతం నమోదైంది. దీంతో ఈ వానాకాలం పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. గడిచిన వానకాలంలో 665.3 మి.మీ సగటు వర్షపాతం నమోదు ఉండగా 903.4 మి.మీ వర్షపాతం నమోదైంది. దీంతో జిల్లాలోని చెరువుల కింద దాదాపు 50 వేల ఎకరాలకు సాగు నీరు అందుతోంది.

వికారాబాద్ జిల్లాలో సాగు అంచనా (ఎకరాల్లో..)

పంట	గతేడాది	ఈ యాసంగి
వరి	45,000	90,179
శనగలు	10,441	20,098
వేరుశనగ	6,526	16,735
జొన్న	3,481	5,601
చెరుకు	2,074	2,321

పరిగి మండలం లక్నాపూర్ ప్రాజెక్టు, కోట్‌పల్లి, జుంటుపల్లి, బొంరాసిపేట్, ఎర్రుమల్ల, హస్నాబాద్, దోమ, కులకచర్ల,

మిగతా 8వ పేజీలో...



చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డికి వినతి పత్రాన్ని అందజేస్తున్న నిరుద్యోగులు

ప్రత్యేక డీఎస్సీ నిర్వహించాలి

ఖాళీ ఉర్దూ పోస్టులు నింపాలి

తాండూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక డీఎస్సీ ద్వారా ఉర్దూ మీడియం పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని శిక్షణ పొందిన నిరుద్యోగ ఉర్దూ మీడియం ఉపాధ్యాయ సంఘం ప్రతినిధుల బృందం కోరింది. ఆదివారం తాండూరుకు వచ్చిన ప్రభుత్వ చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డిని కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. 20 ఏళ్లుగా ఈ పోస్టులు భర్తీ చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని తెలిపారు. ఉర్దూ మీడియం పాఠశాలలు మూతపడే అవకాశాలు ఉన్నాయని ఆయనకు వివరించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ తదితర కోటాలో మిగిలిపోయిన ఉర్దూ మీడియం ఉపాధ్యాయ పోస్టులను సైతం ప్రత్యేక డీఎస్సీ నిర్వహించి మెరిట్ ఆధారంగా భర్తీ చేయాలని కోరారు. స్పందించిన చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. అలాగే సీఎం సలహాదారుడు నరేందర్‌రెడ్డితో అభ్యర్థులతో సమావేశం ఏర్పాటు చేయించి సమస్య పరిష్కారానికి చొరవ చూపుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఖాజా పాషా, ప్రతినిధులు అబ్దుల్ నాసర్, అబ్రహం, రేహన్, అస్లంలు పాల్గొన్నారు.



ర్యాలీ తీస్తున్న ఘట్‌కేసర్ పోలీసులు

పోలీసుల సేవలు మరువలేనివి

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి) : పోలీసుల సేవలు మరువలేనివని ఘట్‌కేసర్ సీఐ పందిరి పరుశురాం తెలిపారు. పోలీస్ అమర వీరుల వారోత్సవాల్లో భాగంగా ఆదివారం పోలీసుస్టేషన్ నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ సేవలో పోలీసులు నిత్యం విధులు నిర్వహిస్తారని తెలిపారు. వారి సేవలు మరువలేనివని గుర్తు చేశారు. పౌరులు సమాజం పట్ల బాధ్యతయుతంగా మెలగాలన్నారు. డ్రగ్స్, మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని, ఆపదలో ఉన్నప్పుడు 100 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో డీఐ శ్రీనివాస్, అడ్మిన్ ఎస్ఐ ప్రభాకర్ రెడ్డి, ఎస్ఐలు నర్సింహ, శ్రీకాంత్, శేఖర్, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

దవాఖానాల్లో పటిష్ట భద్రత

సెక్యూరిటీకి కమిటీల ఏర్పాటు

రోగుల అటెండెంట్లకు విజిటర్ పాస్‌లు

పోలీస్ స్టేషన్‌తో సీసీ కెమెరాల అనుసంధానం

నవంబరు నుంచి అమల్లోకి..



తాండూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): రాత్రి వేళల్లోనూ వైద్య సిబ్బంది ధైర్యంగా విధులు నిర్వర్తించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వైద్యులపై దాడులు, ఇతర అరాచక కార్యక్రమాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం రక్షణ చర్యలు చేపట్టింది. పోలీసులు, వైద్య సిబ్బందితో కలిపి కమిటీలను వేసింది. ఆస్పత్రుల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి వాటిని పోలీస్‌స్టేషన్లకు అనుసంధానిస్తారు. తాండూరు డివిజన్‌లోని తాండూరు జిల్లా ఆస్పత్రి, తాండూరు-హైదరాబాద్ రోడ్డులోని మాతా శిశు ఆరోగ్య కేంద్రాల్లో భద్రత చర్యలు చేపట్టనున్నారు. ఇటీవల తాండూరు జిల్లా ఆస్పత్రిని కలెక్టర్, సబ్ కలెక్టర్, మాతా శిశు ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే.. ఎస్పీతో మాట్లాడి ఆస్పత్రి వద్ద సెక్యూరిటీ ఏర్పాటు చేయాలని కోరారు. దీంతో ఆస్పత్రుల్లో 24గంటల కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తామన్నారు. ఆస్పత్రి ప్రధాన గేట్ల వద్ద స్క్రీనింగ్, సీసీ కెమెరాలు, చెకింగ్ వ్యవస్థను పటిష్టం చేయనున్నారు. రోగుల అటెండెంట్లకు పాసులిచ్చే విధానాన్ని అమలు చేయనున్నారు.

నియంత్రణ కమిటీలు

ప్రభుత్వ ఆస్పత్రిలో సెక్యూరిటీ, వయోలెన్స్ నియంత్రణ కమిటీలు వేస్తారు. ఆస్పత్రిలో భద్రతపై ఈ కమిటీలు పర్యవేక్షిస్తుంటాయి. హాస్పిటల్ సూపరింటెండెంట్ కమిటీ చైర్మన్‌గా, రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ సేఫ్టీ అధికారిగా, కన్వీనర్‌గా ఎస్‌హెచ్‌వో ఉంటారు. అలాగే పోలీసు, వైద్య శాఖల నుంచి వివిధ స్థాయి అధికారులతో పలు కమిటీలు వేస్తారు. ఇప్పటికే తాండూరు ప్రభుత్వ ఆస్పత్రిలో కమిటీలు వేశారు. ఈ కమిటీలు ఆస్పత్రిలో భద్రతపై రోజూ ఆరా తీస్తాయి. వార్డులను పర్యవేక్షిస్తారు. ఆస్పత్రిలో కదలికలను సీసీ ఫుటేజీతో నిక్షిప్తం చేస్తారు. ఇదిలా ఉంటే గతంలో తాండూరు ఆస్పత్రిలో రోగులు, వాటి అటెండెంట్ల నగదు, బంగారు, వెండి ఆభరణాలు చోరీ అయ్యాయి. ప్రసూతి కేంద్రం వద్ద ఉంచిన పాలరాతి మాతా శిశు విగ్రహాన్నీ అపహరించారు. ఆస్పత్రుల వద్ద భద్రతా లోపం వల్లే ఇలా జరిగినట్లు గుర్తించారు.

అటెండెంట్లకు పాస్‌లు ఇస్తాం



ప్రభుత్వ మౌఖిక ఆదేశాలతో జిల్లా కేంద్ర ఆస్పత్రిలో భద్రత కమిటీలు వేశాం. వచ్చే నెల నుంచి ఆస్పత్రి వద్ద భద్రతను పెంచి రోగుల అటెండెంట్లకు పాస్‌ల విధానాన్ని అమలు చేస్తాం. గతంలో రాత్రిపూట రోగులు, వారి బంధువుల డబ్బు, ఫోన్‌లు వంటివి చోరీ అయ్యాయి. ఇకపై ఆస్పత్రిలో సీసీ కెమెరాల నిఘా ఉంటుంది.

- రవిశంకర్, సూపరింటెండెంట్, తాండూరు ప్రభుత్వ ఆస్పత్రి

యువకులు అన్ని రంగాల్లో రాణించాలి

ప్రజాకవి, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న



విగ్రహావిష్కరణలో ప్రజాకవి గోరటి వెంకన్న

పూడూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): యువకులు అన్ని రంగాల్లో రాణించాలని ప్రజాకవి, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న సూచించారు. ఆదివారం మండల పరిధిలోని కంకల్ గ్రామంలో స్వామి వివేకానంద విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వెంకన్న విగ్రహావిష్కరణ అనంతరం మాట్లాడారు. స్వామి వివేకానంద ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని అన్నారు. యువకులు లక్ష్యాన్ని ఏర్పరుకుని ముందుకు సాగాలని సూచించారు. క్రమశిక్షణతో మెలగాలని, ఏకాగ్రత, శారీరక దారుఢ్యం, తల్లిదండ్రులు, పెద్దల పట్ల గౌరవాన్ని కలిగి ఉండాలని అన్నారు. ప్రతి మనిషికి మానసిక ప్రశాంతత అవసరమని, ప్రశాంతత కలిగి ఉన్నపుడే లక్ష్యాన్ని త్వరగా చేరుకుంటామన్నారు. కార్యక్రమంలో యువకులు, గ్రామస్తులు, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో గ్రూపు రాజకీయాల్లేవు

మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వజ్రేశ్ యాదవ్



మేడ్చల్ టౌన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీలో గ్రూపు రాజకీయాలకు తావే లేదని, సీనియర్లు, జూనియర్లు అంతా కలిసి పనిచేస్తున్నామని పీసీసీ ఉపాధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వజ్రేశ్‌యాదవ్ స్పష్టం చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కార్యకర్తలు, నాయకులు కష్టపడి పనిచేయడం వల్లే అధికారంలోకి వచ్చామన్నారు. సీనియర్లకే ఎక్కువ ప్రాధాన్యం ఉంటుందని, కొత్తగా చేరిన వారికి, ఏళ్ల తరబడి జెండా మోసిన వారికి మధ్య తేడా తమకు తెలుసన్నారు. కొన్ని ప్రాంతాల్లో కార్యకర్తలు, నాయకులకు మధ్య విభేదాలున్నా అంతా పార్టీ కోసమే పని చేస్తున్నారన్నారు. గ్రూపు రాజకీయాలను ఉపేక్షించబోమన్నారు. పార్టీ బలోపేతానికి మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు హరివర్దన్‌రెడ్డి, సీనియర్ నాయకుడు ప్రభాకర్‌గౌడ్ కృషిచేస్తున్నారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలను తప్పక పాటిస్తూ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయాల్సిన బాధ్యత నాయకులపై ఉందన్నారు.

మాచనూరులో మౌలిక వసతులు కల్పిస్తాం

గ్రామాన్ని సందర్శించిన తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



మాచనూరు ఆశ్రమానికి వస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మాచనూరు గ్రామానికి అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తామని తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి హామీ ఇచ్చారు. 'పేరుంది.. ఊరే లేదు' అన్న శీర్షికతో ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి ఎమ్మెల్యే స్పందించారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాచనూరు గ్రామాన్ని, అక్కడున్న బీరప్పస్వామి ఆశ్రమాని సందర్శించారు. ఈ సందర్భంగా ఆశ్రమంలో శివైక్యం చెందిన శివయోగి శ్రీ గురు బీరప్పస్వామికి పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడ నివాసం ఉంటున్న స్వామి శివయోగి షీలలింగాతో మాట్లాడారు. గ్రామంలో జనం ఎన్నేళ్లుగా ఉండటం లేదు అనే అంశాలపై ఆరా తీశారు. ఆశ్రమానికి భక్తులు తరచుగా వస్తున్నారా, సౌకర్యాలు పరిస్థితి ఏమిటనేది తెలుసుకున్నారు. భక్తులు ప్రతీ ఆదివారం, మంగళవారం పెద్ద సంఖ్యలో వస్తారని, ప్రత్యేక రోజుల్లో అన్నదాన కార్యక్రమం కూడా నిర్వహిస్తారని వారు ఎమ్మెల్యేకు వివరించారు. ఆశ్రమానికి వచ్చే భక్తులకు రోడ్లు సరిగా లేవని, విద్యుత్, తాగునీటి సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్యేను కోరారు. అయితే అన్ని రకాల సదుపాయాలను కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, తాండూరు మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, డైరెక్టర్లు విజయభాస్కర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ రాజ్‌కుమార్, అనిల్ కుమార్, కాంగ్రెస్ నాయకులు మల్‌రెడ్డి, జగదీశ్వర్ ఉన్నారు.

అంతారం కట్టమైసమ్మ దర్శనం

మండల పరిధిలోని అంతారం కట్టమైసమ్మను ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి ఆదివారం దర్శించుకున్నారు. మైసమ్మ జాతర సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు మహిపాల్ రెడ్డి, ధారాసింగ్, మల్లేశం, రాంచందర్, బిస్కెట్ రఘు, సంకేత్, ఆనంద్‌గౌడ్, సిద్ధూ తదితరులు పాల్గొన్నారు.

'టెడెక్స్'తో విద్యార్థులకు ఉపయోగం



టెడెక్స్ సమ్మేళనంలో పాల్గొన్న ప్రొఫెసర్లు, విద్యార్థులు

మొయినాబాద్ రూరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తమ ఆలోచనలను పంచుకునేందుకు టెడెక్స్ ఒక మంచి వేదికని సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. అజీజ్‌నగర్‌లోని విద్యాజ్యోతి ఇంజినీరింగ్ కాలేజీలో 'పవర్ ఆఫ్ పెర్సిస్టెన్స్' పేరుతో టెడెక్స్ మొదటి సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. వివిధ రంగాల నిపుణులు, ఆవిష్కర్తలు తమ అనుభవాలను పంచుకున్నారు. ముఖ్య అతిథి లక్ష్మీనారాయణ ప్రసంగించారు. ఇలాంటి చర్చా వేదికలతో విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఆలోచనల ఎక్స్ఛేంచ్‌తోనే నూతన ఆవిష్కరణలు వస్తాయన్నారు. కార్యక్రమంలో 'ది సెంటర్ ఫర్ ఎక్సలెన్స్' డైరెక్టర్ నిఖిల్‌దేశాయ్, పర్వతారోహకురాలు హస్వీమురికి, మిస్ ఇండియా ఏపీ-2022 లలిత, కాలేజీ చైర్మన్, ఎమ్మెల్యే పి.రాజేశ్వర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సాయిబాబరెడ్డి, డీన్ పద్మజ, అడ్మినిస్ట్రేటర్ వెంకటాచలం, కోఆర్డినేటర్ శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్లపై భారీ గుంతలు ..
వాహనదారుల ఇబ్బందులు

- అడుగడుగునా ధ్వంసమైన రోడ్లు
- తరచూ చోటుచేసుకుంటున్న వాహన ప్రమాదాలు
- ప్రజల ఇక్కట్లపై పట్టించుకోని ప్రజా ప్రతినిధులు, అధికారులు


దుగ్గాపూర్ గేటు సమీపంలో పూర్తిగా ధ్వంసమైన రోడ్డు

పెద్దేముల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలో చాలా రోడ్లు గుంతలు పడడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. తాండూరు-హైదరాబాద్ రోడ్డు కందనెల్లి శివారు నుంచి మన్‌సాన్‌పల్లి వరకు పాడైంది. పెద్దపెద్ద గుంతలు పడ్డాయి. తాండూరు-కోట్‌పల్లి రోడ్డు కూడా గుంతలమయమే. గ్రామీణ రోడ్లపై అడుగడుగునా భారీ గుంతలు, తేలిన కంకరతో ప్రయాణికులు నరకం అనుభవిస్తున్నారు. వాటిపై నడిచే వాహనాలు సైతం పాడవుతున్నాయి. టైర్లు పంక్చరవుతున్నాయి. తాండూరు-హైదరాబాద్ రోడ్డుపై ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు తరచూ తిరుగుతూనే ఉంటారు. వారికి రోడ్ల దుస్థితి కన్పించడం లేదా? అని ప్రజలంటున్నారు. గోతుల రోడ్లపై రాత్రివేళల్లో ప్రయాణం మరింత ఇబ్బందిగా మారిందని, ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణిస్తున్నామని వాపోతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే రోడ్లను బాగు చేయించాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.


గుంత వద్ద బైక్‌పై నుంచి పడ్డ నర్సమ్మ


సీసీతో గుంతలు పూడ్చుతున్న స్థానికులు

బైక్ నుంచి పడి మహిళకు గాయాలు

మంబాపూర్ గ్రామానికి చెందిన ఉప్పరి నర్సమ్మ తన కుమారుడితో కలిసి బైక్‌పై వెళ్తూ చైతన్యనగర్ గేటు సమీపంలో ఎదురుగా వచ్చిన వాహనానికి దారివ్వబోయి గుంతలో పడిపోయారు. ఆమె అపస్మారక స్థితికి వెళ్లడంతో వికారాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. కుటుంబీకులు రూ.4లక్షల వరకు అప్పు చేసి ఆమెకు చికిత్స చేయిస్తున్నారు.

అధికారుల్లో స్పందన కోసమే..



ఒక పనిచేయాలంటే ఎవరో ఒకరు ముందుకు రావాలంటారు. అందుకోసమే నేను కొంత చేస్తే అధికారులు స్పందించి రోడ్డు బాగుచేస్తారని అనుకున్నా. కందనెల్లి సమీపంలో రోడ్డుపై కొన్ని గుంతల్లో సీసీతో పూడ్చాను. చాలా మంది విద్యార్థులను రోజూ బైక్‌లపై తాండూరు తోలుకెళ్లి తీసుకొస్తుంటాం. బైక్‌పై వెళ్తుంటే గుంతల్లో ఎక్కడ పడిపోతామోనని భయమైతుంది. అధికారులు ఇప్పటికైనా గుంతలు పూడ్చేలా చర్యలు తీసుకోవాలి.

- సర్దార్, వాహనదారుడు, కందనెల్లి

పద్మశాలి సంఘం మండల కమిటీ


పద్మశాలి సంఘం నూతన కమిటీ సభ్యులు

కేశంపేట, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): పద్మశాలి సంఘం మండల నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కోట చెందు, ఉపాధ్యక్షులు గంజి సుధాకర్, గంజి కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శులు ఉడుత హరికృష్ణ, నారని శ్రీనివాసులు, కోశాధికారిగా రాజులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో గంజి చంద్రయ్య, పాలాది రమేష్, శ్రీకాంత్, బాలకృష్ణ, అంజయ్య, చంద్రశేఖర్, సాయి, వెంకటేష్, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

పడిపోతున్న పత్తి ధర


గోడౌన్‌లో నిల్వ చేస్తున్న పత్తి

- దూది రైతుకు దుఃఖమే
- దక్కని మద్దతు ధర
- జాడ లేని సీసీఐ కొనుగోళ్లు

తాండూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): తెల్ల బంగారం పండిస్తున్న రైతుల ఆశలు అడియాశలవుతున్నాయి. రోజురోజుకూ పత్తి ధర క్షీణిస్తోంది. పంటకు మద్దతు ధర లభించక రైతులు ఆవేదన చెందుతున్నారు. గతేడాదితో పోలిస్తే ఈ యేడాది ధర తక్కువుందని రైతులంటున్నారు. కొనుగోళ్ల మొదలు నుంచి పోలిస్తే ఇప్పటి వరకు క్వింటాల్‌పై కనిష్ఠంగా 200 నుంచి గరిష్ఠంగా రూ.400 వరకు ధర తగ్గింది. ప్రభుత్వ మద్దతు ధర రూ.7,521, తేమ శాతాన్ని పరిగణంలోకి తీసుకుంటూ మిల్లర్లు రేటును నిర్ణయిస్తున్నారు.

ఆంధ్రా నుంచి కూలీల రాక

పత్తి తీతకు కూలీల కొరత ఏర్పడింది. తాండూరు నియోజకవర్గంలోని రైతులు ఆంధ్ర ప్రాంతంలోని మంత్రాలయం, ఆళ్లగడ్డ ప్రాంతాల నుంచి కూలీలను రప్పించి పత్తిని తీయిస్తున్నారు. జీవన్గి, గోనూర్, కందనెల్లి, మంతట్టి తదితర గ్రామాల్లో ఆంధ్రా ప్రాంత కూలీలు పత్తి తీస్తున్నారు.

ఆలస్యమవుతున్న సీసీఐ కొనుగోళ్లు

భారత పత్తి సంస్థ(సీసీఐ) పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు ఆలస్యమవుతోంది. నవంబరు మొదటి వారంలో ఏర్పాటయ్యే అవకాశాలున్నాయని అధికారులు పేర్కొంటున్నారు. కేంద్రం ఏర్పాటుపై సీసీఐ అధికారులు ఇటీవల తాండూరులో పర్యటించి పరిశీలించారు. ప్రస్తుతం యాలాల మండలం దౌలాపూర్ ఒకటి, అగ్గనూర్ రెండు పత్తి జిన్నింగ్ మిల్లుల్లో వ్యాపారులు కొంటున్నారు. ఇక్కడ పత్తికి మద్దతు ధర ఇవ్వడం లేదు. సీసీఐ కేంద్రం ఏర్పాటు ఆలస్యంతో పరోక్షంగా వ్యాపారులకు అధికారులు మద్దతిస్తున్నారనే ఆరోపణలొస్తున్నాయి.

తేమ శాతంతో పత్తి ధర నిర్ణయం

తేమ 8 నుంచి 12శాతం ఉన్న పత్తికి రూ.7,521 ధర పెడుతున్నారు. 9శాతం రూ.75 తక్కువ, 10శాతం ఉంటే రూ.150, 11శాతం తేమ ఉంటే రూ.225, 12శాతం ఉంటే రూ.300 తక్కువ చొప్పున లెక్కించి రైతు బ్యాంకు ఖాతాల్లో డబ్బు జమ చేస్తారు. 12శాతం కంటే ఎక్కువ తేమ ఉన్న పత్తి కొనరు. అమ్మకం సమయంలో రైతులు ఆధార్ నంబర్, బ్యాంక్ అకౌంట్ నంబర్లు ఇవ్వాల్సి ఉంటుంది.

రైతుల సౌకర్యార్థం వాట్సాప్ నంబర్

పత్తి పంట అమ్మే రైతుల కోసం ప్రభుత్వం ఒక నంబర్‌ను కేటాయించింది. వాట్సాప్ నంబర్ 8897281111లో వివరాలు నమోదు చేస్తే క్షణాల్లో సమాచారం లభిస్తుందని అధికారులు చెబుతున్నారు. మద్దతు ధర, సమీప జిన్నింగ్ మిల్లుల సమాచారం, ఖాతాలో డబ్బు పడిందా? లేదా వంటి సమాచారాన్ని రైతులు తెలుసుకోవచ్చు.

తేదీ	తేమ శాతం	రేటు(రూపాయలు)
21-10-2024	8శాతం-12శాతం	7,001-7,401
	రెండో రకం	6,401-7,001
22-10-2024	8శాతం-12శాతం	6,951-7,351
	రెండో రకం	6,351-6,951
23-10-2024	8శాతం-12శాతం	6,951-7,351
	రెండో రకం	6,351-6,951
24-10-2024	8 శాతం-12శాతం	6,901-7,301
	రెండో రకం	6,201-6,901
25-10-2024	8శాతం - 12శాతం	6,851-7,251
	రెండో రకం	6,251-6,851
26-10-2024	8శాతం - 12శాతం	6,801-7,201
	రెండో రకం	6,001-6,801

'ఇత్తడి ప్రభ' తయారీకి విరాళం


విరాళాన్ని అందజేస్తున్న మహేందర్‌రెడ్డి

షాద్‌నగర్ అర్బన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద లోని అంజనేయస్వామికి ఆలయానికి ఇత్తడి ప్రభ తయారీకి బీజేపీ నాయకుడు, న్యాయవాది చెంది మహేందర్‌రెడ్డి తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం రూ.35వేలు అందజేశారు. ఆలయ నిర్మాణ బాధ్యతలు చేపడుతున్న వెంకటేష్ గుప్తా, వెంకటయ్యలకు ఆదివారం ఆయన డబ్బు ఇచ్చారు. మహేందర్‌రెడ్డిని గ్రామస్తులు అభినందించారు. నర్సింహ పాల్గొన్నారు.

ముగిసిన కలర్ చాంప్ ఆర్ట్ పోటీలు


మాట్లాడుతున్న అమిత్ కృష్ణ

శంషాబాద్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): శంషాబాద్‌లోని ఎస్సార్ క్లాసిక్ కన్వెన్షన్‌లో ఒక రోజుపాటు నిర్వహించిన కలర్ చాంప్ 24వ ఆర్ట్ పోటీలు ఆదివారం ముగిశాయి. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఉదయం పోటీలను పారిశ్రామిక డిజైనర్ వ్యవస్థాపకుడు, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డిజైన్(ఎన్ఐడీ), ఇండియన్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ(ఐఎస్‌పీపీ) ఢిల్లీ విజిటింగ్ ఫ్యాకల్టీ అమిత్‌కృష్ణ గులాటీ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కళల్లో తప్పు లేదా ఒప్పు అనేది ఉండదన్నారు. కళ ఎల్లప్పుడు సరైందేనన్నారు. కళ ఒక నైపుణ్యమని, ఇది ప్రజలను సంతోష పరుస్తుందన్నారు. సాయంత్రం విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

ఘనంగా గ్యార్మీ షరీఫ్ వేడుకలు


గ్యార్మీ జెండాతో ముస్లింలు

ఆమనగల్లు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లులోని పీర్ల మసీద్ కాలనీ మహబూబ్ సుభాని దర్గా వద్ద గ్యార్మీ షరీఫ్ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. అంజుమనే గులామే ముస్తాఫా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ముస్లింలు, యువకులు పాల్గొన్నారు. దర్గా నుంచి గ్యార్మీ జెండాతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం దర్గాలో జెండాను ప్రతిష్ఠించారు. హఫీజ్ మౌలానా వాహెద్ ఆధ్వర్యంలో ప్రార్థనలు, దువ్వా చేపట్టారు. ప్రజలకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో జామామసీద్ అధ్యక్షుడు మాసూమ్, నాయకులు రజాక్, ఖాదర్, అజీమ్, ఖలీం, ఇమ్రాన్, కమిటీ సభ్యులు అక్రం, అక్సర్, బాబ, అజహర్, అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం


వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే

పెద్దేముల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యమే మహా భాగ్యమని, మనిషి ఆరోగ్యంగా ఉంటేనే ఏదైనా చేయగలడని తాండూరు ఎమ్మెల్యే బి.మనోహర్‌రెడ్డి అన్నారు. ఓమ్లానాయక్‌తండాలో సుమిత్ర రాథోడ్ ఆధ్వర్యంలో ఆదివారం వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేయగా ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యేకు వైద్యసిబ్బంది పరీక్షలు నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తండాలో సుమిత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించడం హర్షణీయం అన్నారు. ఎంతో మందికి అనారోగ్యంగా ఉన్నా ఖర్చులకు భయపడి వైద్యపరీక్షలు చేయించుకోవడం లేదన్నారు. అలాంటి వారికి ఇలాంటి శిబిరాలు ఉపయోగకరం అన్నారు. సుమిత్ర, వైద్య పరీక్షలు చేసిన విరించి ఆస్పత్రి సిబ్బందిని ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధానకార్యదర్శి ధారాసింగ్, ఏఎంసీ చైర్మన్ అంజయ్య, వైస్‌చైర్మన్ నారాయణరెడ్డి, కాంగ్రెస్ నాయకులు జి.నారాయణరెడ్డి, శోభారాణి, మహిపాల్‌రెడ్డి, యు.మల్లేశం, జితేందర్‌రెడ్డి, డీవై.నర్సిములు, కోహీర్ రవిశంకర్ పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే వేర్వేరు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కాంగ్రెస్ నాయకుడు, వ్యాపారవేత్త కె.రవిశంకర్ తండ్రి బిచ్చన్నకు ఇటీవల గుండెపోటు రావడంతో హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో బైపాస్ సర్జరీ చేయించారు. ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయిన ఆయనను ఎమ్మెల్యే పెద్దేముల్‌లోని ఇంటికి వెళ్లి బిచ్చన్నను పరామర్శించారు.

కార్మికులకు వైద్య పరీక్షలు



వికారాబాద్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కార్మికులందరికీ 50రకాల వైద్యపరీక్షలు ప్రభుత్వం ఉచితంగా చేస్తోందని హెల్త్ క్యాంప్ కో-ఆర్డినేటర్ విష్ణువర్ధన్ తెలిపారు. ఆదివారం వికారాబాద్‌లోని గ్రంథాలయం ఆవరణలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని లేబర్ కార్డున్న కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వం ఈ పరీక్షలు జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని కార్మికులంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆ ఊరిలో.. మూడు బొడ్రాయిలు




కింది బస్తీలోని బొడ్రాయి, ఎస్‌బీఐ బ్యాంకు ముందు, మునిసిపల్ ఆఫీస్ సమీపంలో..

- ఎక్కడా లేని విధంగా ఆదిభట్లలో ఏర్పాటు
- ఎప్పుడు ఎవరు ప్రతిష్ఠించారో తెలియదు
- మూడు నాభి శిలలకు ప్రత్యేక పూజలు
- ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు

ఆదిభట్ల, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఆదిభట్ల గ్రామం అన్నింటికీ ప్రత్యేకమే.. ఇక్కడా పెద్దపెద్ద మల్టీనేషనల్ సాఫ్ట్‌వేర్ కంపెనీలన్నీ ఇక్కడే వెలిశాయి. దేశం నలుమూలల నుంచి వేల సంఖ్యలో ఇక్కడకు వచ్చి ఉపాధి పొందుతున్నారు. దీంతో ఈ ప్రాంతం అభివృద్ధిలో పరుగులు పెడుతోంది. దీనికితోడు ఈ గ్రామం దేశంలో ఎక్కడా లేని విధంగా మూడు బొడ్రాయిలు దర్శనమిస్తాయి. ఇలా ఎందుకు ఏర్పాటు చేశారో ఎవరికీ అంతుచిక్కని రహస్యం ఇది. ఆదిభట్లలోని కింది బస్తీలో ఒకటి మధ్యలో ఎస్‌బీఐ ఎదుట మరోటి, మున్సిపల్ ఆఫీస్ సమీపంలో ఒకటి మొత్తం మూడు చోట్ల బొడ్రాయిలున్నాయి. వందల ఏళ్ల కిందట గ్రామాన్ని నిర్మించిన రోజు ఏర్పాటు చేసిన బొడ్రాయి గ్రామంలో సీసీ రోడ్ల ఏర్పాటుతో భూమికి సమానంగా మారుతున్నాయి. అనేక గ్రామాలలో బొడ్రాయిని తొలగించి పూజలు నిర్వహించి కొత్త నాభిశిల ఏర్పాటు చేస్తుండటం తరుచూ చూస్తున్నాం. ఆదిభట్లలో ఉన్న ఈ మూడు నాభిశిలలు భూమి లేవల్‌కు చేరుకున్నాయి. ఇక్కడ కూడ కొత్తది ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు వచ్చినా పైకి లేపాలంటే ముందు ఏది కదిలించాలి అనే మీమాంసతో ఎవరూ ముందుకు రావడం లేదు. ఏ ఉద్దేశంతో ఏర్పాటు చేశారు? అనవసరంగా కదిలిస్తే ఏలాంటి సమస్యలు వస్తాయో? అని వాటి జోలికి పోవడం లేదు. ఏదేమైనా గతంలో డంపింగ్ యార్డు కోసం గుర్తించిన ఓ శివారు కుగ్రామం నేడు జాతీయ అంతర్జాతీయ గుర్తింపునకు నోచుకొని ప్రపంచపటంలో చోటు దక్కిందంటే ఆ బొడ్రాయి నాటిన వేళావిశేషం కూడా కావచ్చని గ్రామస్తులు చెప్పుకోవడం గమనార్హం.

ఎప్పుడు పెట్టిండ్రో తెలవదు



మా ఊరిలో మూడు బొడ్రాయిలు ఉన్న విషయం నేను చిన్నతనం నుంచి చూస్తున్నా. మాతాతల కాలం నుంచే ఉన్నాయి. ఎక్కడ కూడా ఇలా మూడు బొడ్రాయిలు ఉండవు. ఎప్పుడు పెట్టిండ్రో, ఎందుకు పెట్టిండ్రో తెల్వదు. ఏ ఊరిలో మూడు బొడ్రాయిలు చూడలే ఇక్కడనే ఈ సిత్రం ఉందంటూ ఊరికి వచ్చిన చుట్టాలు మాట్లాడుతరు.

- కోరే జంగయ్య, ఆదిభట్ల

ఈ బొడ్రాయిలతో మంచే జరిగింది



దేశంలోనే ఎక్కడ లేని విదంగా మా ఊరిలో మూడు చోట్ల బొడ్రాయిలు ఉండటం మా అదృష్టంగా చెప్పుకుంటాం. గ్రామానికి గుర్తింపు రావడానికి నాభిశిల పాతిన వేళావిశేషంగా మాపెద్దలు చెబుతుంటారు. ఏ ఆచారం ప్రకారం ఏర్పాటు చేశారో తెలియదు గాని వాటి వల్ల మంచి జరిగిందని చెప్పొచ్చు. కనీస ఉపాధి అవకాశాలు లేని స్థాయి నుంచి వేల మందికి ఉపాధి ఇచ్చే స్థాయికి ఆదిభట్ల చేరుకుంది.

- మర్రి నిరంజన్ రెడ్డి, చైర్మన్ ఆదిభట్ల మున్సిపాలిటీ

ముదిరాజ్ సంఘం మండలాధ్యక్షుడిగా పాండు

కందుకూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధన్నారానికి చెందిన పిట్టల పాండు ముదిరాజ్‌ను సంఘం మండల అధ్యక్షుడిగా ఎన్నుకున్నట్లు మాజీ అధ్యక్షుడు బి.అంజయ్య తెలిపారు. ఆదివారం కందుకూరులోని సంఘం భవనంలో ఏర్పాటు చేసిన సమావేశానంతరం అంజయ్య మాట్లాడారు. పాండును అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని, త్వరలో పూర్తిసాయి కమిటీని ఎన్నుకుంటామన్నారు. సంఘం మాజీ అధ్యక్షులు బాబురావు, రాములు, కాకి దశరథ్, జయేందర్, లింగం, డి.శ్రీధర్, యాదయ్య, నాయకులు ఇ.శ్రీనివాస్, బాల్‌రాజ్, ఉదయ్‌కిరణ్, కె.సురేందర్, గ్రామాల అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థుల సమ్మేళనం


కలుసుకున్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

బషీరాబాద్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): బషీరాబాద్ జడ్పీ పాఠశాలలో 2007-08 బ్యాచ్ పదోతగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేసుకున్నారు. 18ఏళ్ల తర్వాత ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా కొర్విచెడ్ వద్ద గల ఓ ఫంక్షన్ హాల్‌లో కలిసి పాఠశాల రోజులను గుర్తుచేసుకున్నారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. నాటి ఉపాధ్యాయులు మాధురి, పురుషోత్తం, ఆనంద్, వెంకటస్వామి, సురేష్, రాములు, సతీష్, జగదేవి, నాగరాజు, భాగ్యలక్ష్మి, పాషా, పూర్వ విద్యార్థులు సతీష్, శాంత్‌కుమార్, రాజేందర్‌రెడ్డి, ముక్తార్, అరవింద్, వికాస్, రవీందర్, మోహన్, రమేష్, రవికుమార్, అంజి, యాదయ్య, జగ్గయ్య, నరేందర్, సకారాం, కుమార్, బషీర్ పాల్గొన్నారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటా


తండా వాసులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

బొంరాస్‌పేట్/కొడంగల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): అధైర్య పడొద్దు.. అండగా ఉంటానని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. దుద్యాల మండలం రోటిబండ తండాలో ఫార్మా కంపెనీకి వ్యతిరేకంగా నిరసన చేపట్టిన సంఘటనలో గాయాలైన తండావాసులను ఆదివారం పరామర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి పథకాలు ఇవ్వకున్నా పర్వాలేదుగానీ పేదల భూముల జోలికి రావొద్దన్నారు. భూ నిర్వాసితులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని, ఎవరూ ఆందోళన చెందొద్దని భరోసా ఇచ్చారు. అలాగే నరేందర్‌రెడ్డి పలు శుభకార్యాల్లో పాల్గొన్నారు. మద్దూర్ మండలంలో మాజీ ఏఎంసీ చైర్మన్ వీరారెడ్డి మనుమరాలి ఊయల వేడుకకు, కొడంగల్ మండలం దర్మాపూర్‌లో గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు.

డ్రోన్‌తో పిచికారీ.. రైతుకు ఉపకారి!

- తక్కువ సమయంలో పొలాల్లో పురుగుల మందు స్ప్రే
- రూ.500 ఖర్చుతో ఐదు నిమిషాల్లోనే ఎకరం మేర పిచికారీ
- రైతులకు సమయం, పెట్టుబడి ఖర్చు ఆదా!


రెడ్డి ఘణాపూర్‌లో వరిపై పిచికారీ చేస్తున్న డ్రోన్, ఒడ్డున ఉండి డ్రోన్‌ను ఆపరేట్ చేస్తున్న యువకుడు

బషీరాబాద్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): రైతులు సాగులో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారు. తక్కువ శ్రమ, తక్కువ ఖర్చు, తక్కువ సమయంలో పని పూర్తిచేసేందుకు ఉన్న అవకాశాలపై వెతుకున్నారు. పంటలపై పురుగుల మందు పిచికారీ రైతులకు సవాల్‌గా మారింది. కూలీలు దొరకక, సకాలంలో పురుగుల మందును పంటలపై పిచికారీ చేయలేపోతున్నారు. రైతులు డ్రోన్ స్ప్రేయర్లతో పిచికారీ, చేయిస్తూ కొంత వెసులుబాటు పొందుతున్నారు.

ఐదు నిమిషాల్లో ఎకరం పంటపై పిచికారీ..!

ఏ పంటకైనా ఇద్దరు వ్యక్తులు రోజంతా స్ప్రే చేస్తే మూడు, నాలుగు ఎకరాలకు మించి మందు కొట్టలేరు. అదే డ్రోన్‌తో రోజూ వంద ఎకరాల్లో పిచికారీ చేయొచ్చు. డ్రోన్‌తో ఐదు నిమిషాల్లో ఎకరం పొలాన్ని ఒకే వ్యక్తి పిచికారీ చేసుకోవచ్చు. గడ్డిమందు, పంటలపై మందుల పిచికారీకి రైతులు డ్రోన్‌ల వినియోగంపై ఇప్పుడిప్పుడే దృష్టిపెడుతున్నారు. దీంతో రైతులకు కూలీల ఖర్చు తగ్గి సమయం కూడా ఆదా అవుతుంది. అదీగాక మనిషితో పోలిస్తే డ్రోన్‌తో పిచికారీ చేస్తే మొక్క మొత్తం వేళ్ల వరకు తడిసి పురుగు చనిపోయే ఆస్కారం ఉంది. అలాగే డ్రోన్ ఫ్యాన్ గాలి ధాటికి పైరుపై ఉండే పురుగులు సైతం పడిపోయే అవకాశం ఉంది. రైతు పొలంలో అడుగుపెట్టకుండానే గాలిలోనే డ్రోన్‌తో మందు పిచికారీ చేసే అవకాశం ఉంది. రసాయన మందు, అవసరమున్న మేరకు నీటిని సిద్ధంగా ఉంచితే మిగతా పని డ్రోన్ ఆపరేటర్ చూసుకుంటాడు. మంతట్టి, రెడ్డిఘణాపూర్, కాశీంపూర్, గొట్టిగఖుర్దు గ్రామాల రైతులు డ్రోన్‌తో పత్తి, కంది, వరి పంటలపై పిచికారీకి మొగ్గు చూపుతున్నారు. 12నుంచి 15లీటర్ల ట్యాంక్ కెపాసిటీ ఉన్న డ్రోన్ ధర రూ.7.6లక్షలు ఉంది. కొందరు పెద్ద రైతులు డ్రోన్లు కొని తమ పొలాల్లో పిచికారీ చేసుకుంటూ తోటి రైతుల పొలాల్లో పిచికారీ చేస్తూ ఉపాధి పొందుతున్నారు. డ్రోన్‌తో ఎకరం పిచికారికి రూ.500 తీసుకుంటున్నట్లు రైతులు చెబుతున్నారు. డ్రోన్‌తో పైమందు పిచికారీకి సమయం ఎంతో ఆదా అవుతుంది. 25 నుంచి 30 నిమిషాల్లో 5ఎకరాల్లో పిచికారీ చేయొచ్చు. డ్రోన్ ఎలక్ట్రిక్ చార్జింగ్‌తో పనిచేస్తుంది. దీంతో పెట్రోల్, డీజిల్ ఖర్చు కూడా ఉండదు. రసాయనం కలిపిన 12 లీటర్ల నీటితోనే ఎకరం పంటపై పిచికారీ చేయడం డ్రోన్ల మరో ప్రత్యేకత!

సబ్సిడీపై డ్రోన్‌లు ఇస్తే రైతులకు మేలు



డ్రోన్ల రాకతో కూలీల ఇబ్బంది తప్పింది. కూలీలు దొరకక సకాలంలో మందు పిచికారీ చేయకుంటే పంటలకు ఎక్కువ నష్టం కలుగుతుంది. డ్రోన్‌తో త్వరగా ఎప్పుడంటే అప్పుడు పిచికారీ చేస్కోవచ్చు. దీంతో డబ్బు, సమయం, ఆదా అవుతుంది. రైతులకు శ్రమ కూడా తక్కువే. ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై డ్రోన్‌లు ఇస్తే బాగుంటుంది. దీంతో సన్నచిన్నకారు రైతులు అదనంగా ఉపాధి పొందుతారు.

- ఎండీ యాసిన్, రైతు, రెడ్డిఘణాపూర్

న్యూస్ బాక్స్

ఉద్యోగాలు సాధించిన అక్కాచెల్లెళ్లకు సన్మానం


రజిత, అరుణలను సన్మానిస్తున్న మిత్రబృందం సభ్యులు

పరిగి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): సుల్తాన్‌గ్రామానికి చెందిన పద్మ కూతుళ్లలో ఒకరు రజితకు ఎంబీబీఎస్ సీటు, మరొకరు అరుణకు డీయస్సీలో టీచర్ ఉద్యోగం సాధించారు. ఈ సందర్భంగా ఆదివారం పద్మ చదువుకున్న పరిగి ప్రభుత్వ జూనియర్ కళాశాల 1996-98 ఇంటర్మీడియట్ బ్యాచ్ మిత్రబృందం ఆధ్వర్యంలో శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డు హెచ్‌ఎం ఈశ్వరయ్య, మిత్రబృందం సభ్యులు వెంకటేశ్‌గౌడ్, మోయిజ్‌ఖాన్, యూసుఫ్, వేణు, ఆంజనేయులు, కృష్ణ, మోహన్, సతీష్, సాయిలు, అమృత తదితరులు పాల్గొన్నారు.

ఉస్మాన్‌అలీకి ఏపీజే అబ్దుల్‌కలాం జాతీయ అవార్డు


ఉస్మాన్‌కు అవార్డును అందజేస్తున్న రాధాకృష్ణ

పరిగి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): పరిగి మండలం మిట్టకోడూరు ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం ఎండీ ఉస్మాన్‌అలీకి ఏపీజే అబ్దుల్‌కలాం జాతీయ అవార్డు వరించింది. నగరంలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం బహుజన సాహిత్య అకాడమి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉస్మాన్‌అలీకి బహుజన సాహిత్య అకాడమి అధ్యక్షుడు రాధాకృష్ణ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా ఉస్మాన్‌అలీ మాట్లాడుతూ.. జాతీయ అవార్డు అందుకోవడం మరింత బాధ్యతను పెంచిందని తెలిపారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి


డ్రైనేజీని శుభ్రం చేయిస్తున్న రిషిక్‌రెడ్డి

పూడూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్లాంపిన్ రిసార్ట్ చైర్మన్ రిషిక్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని తిర్మలాపూర్‌లో ఆదివారం డ్రైనేజీలను రిషిక్‌రెడ్డి శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన ఊరు, మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునే బాధ్యత మన అందరిపై ఉందన్నారు.

పాత భవనంపై కన్ను!



పాత మున్సిపల్ కార్యాలయ భవనం

● తాండూరు మున్సిపల్ బిల్డింగ్‌కు రియల్టర్ల ఎసరు ● రికార్డులు లేవని తేల్చిన అధికారులు

తాండూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తాండూరు పాత మున్సిపాలిటీ భవనంపై రియల్టర్ల కన్ను పడింది. ఈ భవనం స్థలానికి సంబంధించి ఎలాంటి రికార్డులు లేవని ఇటీవల టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు లిఖిత పూర్వకంగా స్పష్టం చేశారు. దీంతో రియల్టర్లు, బడా బాబులు, వ్యాపారుల కన్ను ఈ పాత మున్సిపల్ భవనం, ఖాళీ స్థలంపై పడినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇటీవల ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'బల్దియా భవనం - ఫైల్ మాయ! శీర్షికన ప్రచురితమైన కథనంతో తాండూరు పట్టణంలో చర్చ జరిగింది.

దానం ఇచ్చిన ఆస్తికి ఎసరు

ఈ మున్సిపాలిటీ భవనం పూర్వ పరాలను పరిశీలిస్తే పాత తాండూరుకు శెట్టి చంద్రశేఖర్ మున్సిపల్ చైర్మన్‌గా జూన్ 1962 నుంచి డిసెంబర్ 1972 మధ్యలో మున్సిపాలిటీకి శాశ్వత భవనం ఏర్పాటుకు నిర్ణయించారు. ఆ భవనానికి అవసరమైన స్థలాన్ని పట్టణానికి చెందిన గోవింద్ రాజు అనే వ్యక్తి పన్నుల రూపేణ మున్సిపాలిటీ వేలాది రూపాయలు మున్సిపాలిటీకి బాకీ పడ్డారు. ఆయన బకాయిలు చెల్లించక లేక తన భూమిని పన్ను కింద బల్దియాకు రాసిచ్చారు. అప్పుడు ఆ స్థలంలో సొంత భవనాన్ని నిర్మించి అందులో సుమారు 50 ఏళ్ల పాటు పరిపాలన కొనసాగించారు. అలాంటి చరిత్ర ఉన్న పాత మున్సిపల్ భవనాన్ని ప్రైవేట్ పరం చేసే యోచనలో అధికారులు పావులు కదుపుతున్నట్లు సమాచారం. ఈ భవనానికి, స్థలానికి సంబంధించిన డాక్యుమెంట్లు లేవని పేర్కొంటున్నారనే వాదన మార్కెట్‌లో వినబడుతుంది. రికార్డులు లేనప్పుడు ఇటీవల ఈఎస్ఐ డిస్పెన్సరీ ఏర్పాటుకు పాత మున్సిపాలిటీ భవనాన్ని ఎలా అప్పగిస్తారని ప్రశ్న లేవనెత్తుతున్నారు. చివరగా మున్సిపాలిటీకి మిగిలిన ఆస్తి పాత మున్సిపాలిటీ ఒక్కటే. ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, యువకులు, ఎలా స్పందిస్తారో వేచి చూడాలి మరి. !

పేద విద్యార్థుల అభ్యున్నతికి కృషి


ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను సన్మానిస్తున్న స్వేరోస్ నాయకులు

పరిగి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): స్వేరోస్ నెట్‌వర్క్ ద్వారా పేద విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేస్తున్నట్లు మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఆయన కర్ణాటక వెళుతున్న క్రమంలో ఆదివారం పరిగిలోని స్వేరోస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ నివాసానికి వచ్చారు. స్వేరోస్ ప్రతినిధులతో కలిసి టిఫిన్ చేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ పేదలు అభివృద్ధి చెందాలంటే చదువు ఒక్కటే మార్గమని, పేదవిద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదిగేందుకు ప్రయత్నించాలని సూచించారు. సమసమాజం నిర్మాణానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్వేరోస్ ప్రతినిధులు శ్రీనివాస్, వెంకటయ్య, రాజేందర్, బుచ్చన్న, కృష్ణ, నర్సింహులు, హెచ్‌ఎం బసిరెడ్డి ఆనంద్‌గౌడ్, వెంకట్‌రెడ్డి ఉన్నారు.

కళాశాల భవన నిర్మాణానికి శ్రీకారం


పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్ అర్బన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): దాతల సహకారంతో నిర్మించతలపెట్టిన షాద్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన పనులను ఆదివారం మొదలుపెట్టారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ జేసీబీకి కొబ్బరికాయ కొట్టి, పిల్లర్ గోతులను తీయించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలకు అన్ని హంగులతో నూతన భవనాన్ని నిర్మించాలని ఇటీవల ఎమ్మెల్యే శంకర్ ఆధ్వర్యంలో భూమి పూజ చేసిన విషయం విధితమే. ఈ కార్యక్రమానికి పార్టీలకు అతీతంగా ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, మాజీ ఎమ్మెల్యేలు బక్కని నర్సింహులు, చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, బీష్వ కిష్టయ్య, మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్‌తో పాటు బీజేపీ, వామపక్ష, ఎంఐఎం పార్టీల నాయకులు హాజరైన సభలో దాతలు విరాళాలు ప్రకటించారు. దాతల సహకారంతో మోడల్‌గా భవనాన్ని నిర్మించాలని ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఎమ్మెల్యే శంకర్ యుద్ధప్రాతిపదికన భవనాన్ని నిర్మించాలని చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చెంది తిరుపతిరెడ్డి, జి. బాల్‌రాజ్‌గౌడ్, సర్వర్ పాష, రఘు, కృష్ణారెడ్డి, ఇద్రీష్, అగ్గనూరి బస్వం, కొమ్ము కృష్ణ, ఇబ్రహీం, రవికుమార్, ముబారక్, అశోక్, ఖదీర్, మాణిక్యం పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా టీడీపీ


సంజీవగౌడ్ సతీమణిని పరామర్శిస్తున్న బక్కని నర్సింహులు

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటుందని టీటీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు అన్నారు. టీటీడీపీ మండల అధ్యక్షుడు వేముల సంజీవగౌడ్ సతీమణి రాజమణి ఇటీవల అనారోగ్యబారిన పడగా పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు ఆదివారం ఆయన ఘనాపూర్‌లోని ఆయన నివాసంలో ఆమెను పరామర్శించారు. కార్యకర్తల సంక్షేమం కోసం పార్టీ సంక్షేమ నిధిని ఏర్పాటు చేసి ఆదుకుంటుందన్నారు. తెలంగాణలో టీడీపీ అభివృద్ధికి కృషిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీటీడీపీ మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఇన్‌చార్జి కందికంటి అశోక్‌కుమార్‌గౌడ్, నాయకులు వెంకటేష్, జంగారెడ్డి, కృష్ణారావు, కోటేశ్వర్‌రావు, జగన్‌మోహన్‌రెడ్డి, టి.మహేష్, సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

చిన్నారులపై కుక్కల దాడి

వికారాబాద్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎక్కడ చూసినా కుక్కలు గుంపులు గుంపులుగా ఉండడం, మనుషులపై దాడులు చేస్తుండడంతో ఎప్పుడు ఏవైపు నుంచి ఏ ప్రమాదంముంచుకొస్తుందో అర్థం కావడం లేదు. వికారాబాద్ జిల్లా కేంద్రంలో మునిసిపల్ ఆవరణలో అనంతబార్ ముందు ఇద్దరు చిన్నారులు ఆడుకుంటున్న సమయంలో కుక్కల గుంపు ఒక్కసారిగా ఆచిన్నారులపై దాడి చేసింది. చిన్నారులు కింద పడిపోగా కుక్కలు వారిని కొరికే ప్రయత్నం చేయగా సమయానికి గమనించిన స్థానికులు కుక్కలను చెదరగొట్టారు. దీంతో చిన్నారులు స్వల్ప గాయాలతో బయటపడటంతో అంతా ఊపిరి తీసుకున్నారు. ఇప్పటికైనా కుక్కల విషయంలో ప్రభుత్వం ఒక నిర్ణయానికి వచ్చి కుక్కలను పట్టణం నుంచి బయట ప్రాంతాలకు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

అనుమతి లేకుండా డీజే నిర్వహిస్తున్న వారిపై కేసు

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఓ ఫాంహౌజ్‌లో అనుమతి లేకుండా డీజే నిర్వహిస్తున్న వారిపై ఘట్‌కేసర్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ పరశురాం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అంకుశాపూర్‌లోని ది కాంటినెంట్ ఫాంహౌజ్‌లో శనివారం రాత్రి అనుమతి లేకుండా డీజే ఏర్పాటు చేసి పార్టీ చేసుకుంటూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పార్టీ నిర్వహించిన వరుణ్, వికాస్, డీజే యజమాని అంజన్‌కుమార్, డీజే నిర్వాహకుడు లోకేశ్వర్, ఫాంహౌజ్ మేనేజర్ సుధీర్, యజమానిలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

తాండూరులో బీజేపీకి బలమైన కేడర్


మాట్లాడుతున్న రమేష్, పాల్గొన్న నాయకులు

తాండూరు రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో భారతీయ జనతా పార్టీకి బలమైన కేడర్ ఉందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యు.రమేష్ అన్నారు. మండల పరిధిలోని చింతామణిపట్నం, చెంగోల్, పర్వతాపూర్, గౌతాపూర్ గ్రామాల్లో ఆదివారం బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు ప్రభుశంకర్, సభ్యత్వ ప్రముఖ్ ఆంజనేయులు ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యు.రమేష్ మాట్లాడుతూ.. గ్రామ గ్రామాన యువత పెద్దఎత్తున బీజేపీ సభ్యత్వాన్ని తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణాముదిరాజ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు శాంతకుమార్, నాయకులు వడ్ల విజయ్‌కుమార్, కిరణ్, కుర్వ మల్లేష్, రవికుమార్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

ఇదేం ప్రజాపాలన?


పరిగిలో మాట్లాడుతున్న గట్యానాయక్

పరిగి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గంలో గిరిజనులపై పోలీసుచే లాఠీచార్జీ చేయించడం ఇదేనా ప్రజాపాలన అని బహుజన ముక్తి పార్టీ జిల్లా అధ్యక్షుడు పి.గట్యానాయక్ ప్రశ్నించారు. పరిగిలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. దుద్యాల మండలం పార్మాసిటీ వద్దని ఆందోళన చేసిన గిరిజనులపై పోలీస్ జులుం ప్రదర్శించడం ఏమిటన్నారు. ప్రజలు, రైతుల అభిప్రాయం మేరకు పరిశ్రమలు స్థాపించాలని, వారి అభిప్రాయాలకు విరుద్ధం భూసేకరణ చేయరాదని సూచించారు. ఈ సమావేశంలో గోవింద్‌నాయ్, గోవింద్, రవీందర్, రవి పాల్గొన్నారు.

పరశురాంరెడ్డికి ఘన సన్మానం


పరశురాంరెడ్డిని సన్మానిస్తున్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

పరిగి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): పరిగి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన బి.పరశురాంరెడ్డిని ఆదివారం పరిగి వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. పరిగిలోని గంగానదన్ వెంచర్‌లో ఆదివారం ఉదయం ఘనంగా పూలమాల, శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు శశిధర్, లింగమయ్య, గోపాల్, రఘు, లక్ష్మీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

పోలీసులను అరెస్టు చేయడం సరికాదు


ఉప్పలి మల్కయ్య

యాలాల, అక్టోబరు (ఆంధ్రజ్యోతి) 27: తమ సమస్యలు పరిష్కరించాలని నిరసన చేపట్టిన పోలీసులను అరెస్టు చేయడం సరికాదని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర పోలీసుశాఖలో పెండింగ్‌లో ఉన్న డీఏలు ఇవ్వాలని, ఫ్యామిలీ వెల్ఫేర్ అమలు చేసి, వెట్టి చాకిరి తొలగించి 8గంటల పనివిధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. డ్యూటీలో ఉన్న పోలీసులకు కనీస వసతులు కల్పించడం లేదని ఆరోపించారు. డ్యూటీలో మృతిచెందిన పోలీసు కుటుంబాలకు ప్రభుత్వం నుంచి రావాల్సిన పెండింగ్ డబ్బులను వెంటనే ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

మాదాసి కురుమ సంఘం భవన నిర్మాణానికి భూమిపూజ


సంఘం భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న సభ్యులు

తాండూరు రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తాండూరు శివారులోని ఎన్టీఆర్ కాలనీలో మాదాసి కురుమ సంఘం భవన నిర్మాణానికి ఆదివారం భూమి పూజ నిర్వహించారు. అనంతరం పట్టణంలోని హిమాలయ హోటల్‌లో కార్యవర్గ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం కార్యవర్గ ప్రతినిధులు మాట్లాడుతూ మాదాసి కుర్వ సంఘం అభివృద్ధికి ప్రతీ సభ్యుడు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శిగా కందనెల్లి రాఘవేందర్, పకీరప్ప, అధ్యక్షులు దామర్‌చర్ల శివప్ప, కొత్తూరు బాలప్ప తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం


చెక్కును అందజేస్తున్న సన్ రైస్ చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు

ఘట్‌కేసర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మంచానికే పరిమితమైన ఫొటో గ్రాఫర్ మీసాల సత్యనారాయణకు ఎన్ఎఫ్‌సీనగర్‌కు చెందిన సన్ రైస్ చారిటబుల్ ట్రస్టు అండగా నిలిచింది. బాధితుడికి రూ.10వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో వై సుందర్‌రావు, ఎం శ్రీకాంత్, ఎ వీరారెడ్డి, ఐలయ్య, రామయ్య, మదుసుదన్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


నర్సయ్య కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న ప్రభాకర్‌రెడ్డి

దోమ: మండలంలోని గుండాల గ్రామానికి చెందిన కోల చిన్న నర్సయ్య అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పట్లోళ్ల ప్రభాకర్‌రెడ్డి ఆదివారం కుటుంబసభ్యులను పరామర్శించి రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బాలయ్య, మల్‌రెడ్డి, రాచపాల్‌రెడ్డి, నర్సింహారెడ్డి, వెంకటయ్య, దస్తప్ప, అంజి, వెంకటయ్య పాల్గొన్నారు.

తప్పుడు పత్రాలు సృష్టించి ఇబ్బందులు పెడుతున్నారు

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): బిల్డర్ వెంకటేష్ తప్పుడు పత్రాలు సృష్టించి తమను ఇబ్బందులకు గురిచేస్తున్నాడని కొర్రెముల ఎకశీలనగర్ ప్లాట్స్ ఓనర్ అసోయేషన్ సభ్యులు ఆరోపించారు. ఎకశీలనగర్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ బిల్డర్ వెంకటేష్ తప్పుడు పత్రాలు సృష్టించి తమ ప్లాట్లలో నిర్మాణాలు చేయకుండా నిలుపుదల చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొర్రెముల రెవెన్యూ పరిధి సర్వేనెంబర్లు 739 నుంచి 749 వరకు గల 140 ఎకరాల భూమిలో 1985లో వెంచర్ చేశారని తెలిపారు. 2006లో బిల్డర్ వెంకటేష్ సర్వేనెంబర్ 739, 740, 741, 742 పార్టు పేరుతో తప్పుడు పత్రాలు సృష్టించి పట్టాదారు పాసుపుస్తకాలు పొందారని, వీటిపై న్యాయస్థానంను ఆశ్రయిస్తే వాటికి సంబంధించిన మ్యూటేషన్‌ను 2009లో రద్దు చేసినట్లు తెలిపారు. ఆయన పోలీసుబలంతో తమ ప్లాట్లలో నిర్మాణాలు చేసుకోనివ్వడం లేదని ఆరోపించారు. రౌడీలను పెట్టి ప్లాట్ల ఓనర్లపై దాడిచేయిస్తున్నారని తెలిపారు. న్యాయపోరాటం ద్వారానే ప్లాట్లు సాధించుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలని అధ్యక్షుడు మాణిక్యాల రావు, ఉపాధ్యక్షుడు శివారెడ్డి, కార్యదర్శి విజయసేనారెడ్డి, సభ్యులు మాటూరి రవి, బోజిరెడ్డి, ధర్మేందర్, ముత్తారెడ్డి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న శివారెడ్డి

యాసంగిపై గంపెడాశలు!

(5వ పేజీ తరువాయి)

అంతారంప్రాజెక్టు, ఇబ్రహీంపూర్, గడిసింగానూర్, బాసుపల్లి, తదితర చెరువులు భారీగా నిండాయి. బోర్లలో నీరు ఉబికి బయటకు వస్తున్న ఘటనలు కోకోల్లలున్నాయి. వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా 65 వేలకుగాపైగా వ్యవసాయ బోర్లు ఉన్నాయి. విద్యుత్ సరఫరా 10 నుంచి 12 గంటల విద్యుత్‌ను అందిస్తే తమ బతుకులు బాగుపడతాయంటున్నారు.

అవసరమైన ఎరువులు సిద్ధం

గతేడాది యాసంగి 83,254 ఎకరాల్లో పంటలు సాగు కాగా, ఈ సారి 1,42,159 ఎకరాల్లో సాగవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రధాన పంటలైన వరి, జొన్న, శనగ, చెరకు తోపాటు, రాగులు, గోదుమలు, కుసుమలు, నువ్వులు, ఆముదాలు, అలసంద తదితర పంటలు కూడా రెట్టింపు స్థాయిలో సాగు కానుందని అధికారులు అంచనా వేశారు. అందుకు అనుగుణంగా విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే వేరుశనగ, శనగ విత్తనాలు విత్తారు. ఈ వానాకాలం సీజన్‌లో పత్తి, మొక్కజొన్న పంటలు బాగా దెబ్బతినడంతో ఎక్కువగా పత్తినే సాగు చేశారు.

జిల్లాలో 19,758 ఎకరాల్లో సాగు

మేడ్చల్ జిల్లాలో యాసంగి సాగుకు వ్యవసాయ అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ యాసంగి జిల్లా వ్యాప్తంగా 19,758 ఎకరాల విస్తీర్ణంలో పంటలు సాగవుతాయని అధికారులు పేర్కొన్నారు. ఆ మేరకు ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచడానికి ప్రణాళికలు సైతం సిద్ధం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలన కాలంలో మన తెలంగాణ, మన వ్యవసాయం కార్యక్రమం అమలు చేసి యాసంగిలో సాగు చేయాల్సిన పంటలన అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. ఇప్పుడు కూడా



అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని రైతులు కోరుతున్నారు. ప్రస్తుతం వివిధ కంపెనీల విత్తనాలు, ఎరువులు విక్రయించే వ్యాపారులు గ్రామాల్లో ప్రచారం చేస్తున్నారు. విత్తనాల కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యవసాయ శాఖాధికారులు సైతం అవగాహన కల్పించాలని కోరుతున్నారు.

అవసరం మేరకు ఎరువులు సిద్ధం

వరి 13,788, మొక్కజొన్న, జొన్న, మినుములు తదితర పంటలు 691 ఎకరాల్లో, పండ్ల తోటలు 2,808, కూరగాయలు 2,657 ఎకరాలు, ఇతర రకాల పంటలు 520 ఎకరాల్లో సాగవుతందని ప్రణాళికలు రూపొందించారు. సాగు విస్తీర్ణాన్ని బట్టి వరి, ఇతర పంటలతో కలుపుకుని మొత్తం 5 వేల క్వింటాళ్ల విత్తనాలు అవసరం ఉన్నాయని జిల్లా వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులకు నివేదికలను పంపించారు. వరి 4725 క్వింటాళ్లు, మొక్కజొన్న 250 క్వింటాళ్ల విత్తనాలు అవసరం కానున్నాయని అధికారులు అంచనా వేశారు. అదేవిధంగా రైతులకు కావాల్సి ఎరువులు కూడా అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. యూరియా 2,194, డీఏపీ 2,345, కాంప్లెక్స్ 29,327 బస్తాలు అందుబాటులో ఉన్నట్లు అధికారులు తెలిపారు.

సాగువిస్తీర్ణం పెరిగే అవకాశం



యాసంగి సాగుకు ముందస్తుగా చర్యలు తీసుకున్నాం. శనగలు, వేరుశగన విత్తనాలు విత్తుతున్నారు. రైతులకు సరిపడా విత్తనాలు అందుబాటులో ఉంచాం. రైతులు ఆరుతడి పంటల సాగుకే ప్రాధాన్యత ఇవ్వాలని సూచిస్తున్నాం. ముందు జాగ్రత్తగా రైతులకు అవసరం ఉన్న విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయి. బోర్లు, చెరువుల్లో నీరు పెరిగిన కారణంగా సాగు విస్తీర్ణం ఈ సారి రెంట్టింపు కానుంది.

-లక్ష్మీకుమారి, పరిగి డివిజన్, వ్యవసాయ సహాయసంచాలకురాలు

సబ్సిడీ విత్తనాలు సిద్ధం



యాసంగిలో రైతులు సాగు చేయాల్సిన పంటలపై అవగాహన కల్పించడానికి ప్రణాళికలు సిద్ధం చేశాం. రైతులకు ఇబ్బందులు కలుగకుండా ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. వ్యాపారులు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. పంట సాగుకు అనుగుణంగా అవసరమైన విత్తనాలు, ఎరువులు పలు రకాల విత్తనాలు సబ్సిడీపై అందిస్తాం.


- కె.చంద్రకళ, మేడ్చల్ జిల్లా వ్యవసాయాధికారి

రక్తదానం మహాదానం


వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్

మోమిన్‌పేట్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చీమలదరి గ్రామంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఉత్తమ గ్రామ పంచాయతీ అవార్డు గ్రహిత మాజీ సర్పంచ్ ఎం.నర్సింహారెడ్డి జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ చేతుల మీదుగా చీమలదరి గ్రామంలో పది మంది దివ్యాంగులకు ట్రై సైకిళ్లను అందజేశారు. అనంతరం హైదరాబాద్ గాంధీ ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత రక్తదాన శిబిరంలో బీఆర్ఎస్ నాయకులు 100 మంది పాల్గొన్నారు.

గుట్టపై నిటారుగా బండరాయి


కొత్లాపూర్ గ్రామ సమీపంలో గుట్టపై బండరాయి

బషీరాబాద్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్లాపూర్ గ్రామ సమీపంలో ఎత్తైన గుట్టలున్నాయి. ఈ గ్రామ రోడ్డు మార్గం పక్కన ఓ గుట్టలోని ఓ బండరాయి ఎలాంటి ఆధారం లేకుండా రాయిపై నిటారుగా నిలబెట్టినట్లు ఇలా కనబడుతూ చూపారులను ఆకట్టుకుంటోంది. ఊరికి దగ్గరలో బండరాయి ఉండటంతో సెలవుల్లో ఇక్కడి ప్రాంత విద్యార్థులు ఈ గుట్ట దగ్గరికి వచ్చి కాలక్షేపం చేస్తుంటారు.